సాక్షి అనకాపల్లి

7

ఆదివారం । 28 । మే । 2023

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారమే లక్ష్యం



కాలనీలో మహిళల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లి రూరల్: గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. మండలంలోని బవులువాడలో మండల ప్రత్యేకాధికారి హోదాలో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. తాగునీటి కుళాయిలు,విద్యుత్ కనెక్షన్ల మంజూరు కాలేదని కొందరు మహిళలు ఆర్డీవో దృష్టికి తీసుకువచ్చారు. నాలుగు రోజుల్లో వారి సమస్యలను పరిష్కరించాలని ఆర్డీవోఆదేశించారు. పాఠశాలకు వెళ్లి నాడు–నేడు పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేసి, ఆహారపదార్థాలను రుచిచూశారు. జల్‌జీవన్ మిషన్ పనులు,గృహనిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా పనిచేయాలని సూచించారు. తహసీల్దార్ గంగాధర రావు,ఎంపీడీవో కె.ధర్మారావు పాల్గొన్నారు.

కలుపు నివారణ మందు తాగి 18 మేకల మృతి



మృతి చెందిన మేకల వద్ద రోదిస్తున్న యజమానులు

అచ్యుతాపురం(అనకాపల్లి): కలుపు నివారణ మందు తాగి 18 మేకలు మృతి చెందాయి. నరేంద్రపురానికి చెందిన ధూళి నాగరాజు,ధూళి రాజులు తమ ఇరవై మేకలను మేత కోసం జగ్గన్నపేట పరిసరాల్లోని పొలాల్లోకి తీసుకెళ్లారు. అంతకు ముందు జగ్గన్నపేటలోని ఒక రైతు తన పొలంలో కలుపును నివారించేందుకు ఓ డబ్బాలో మందును కలిపి, పొలం వద్దే ఉంచి ఇంటికి వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ గడ్డి మేస్తున్న మేకలు డబ్బాలోని మందును తాగాయి. దీంతో 18 మేకలు మృతి చెందాయి. మరో రెండు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. మృతి చెందిన మేకల ఖరీదు రూ.మూడు లక్షల వరకూ ఉంటుందని పశు వైద్యాధికారుల అంచనా. మేకల యజమానులను ఆదుకోవాలని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు ప్రభుత్వాన్ని కోరారు.

నిధి ఆప్ కే నిఖత్ రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఈఎస్ఐ కార్యాలయంలో పెన్షన్‌దారుల సమస్యలపై నిధి ఆప్ కే నిఖత్ కార్యక్రమాన్ని ఈనెల 29న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు విశాఖ రీజనల్ నోడల్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) ఆఫీసర్ కె.వి.కృష్ణమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ఖాతాదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆడిట్ సమస్యలు రాకుండా రికార్డుల నిర్వహణ



రికార్డులు పరిశీలిస్తున్న సత్యనారాయణ

కశింకోట: ఆడిట్ సమస్యలు రాకుండా రికార్డులను నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని ఉమ్మడి విశాఖ జిల్లాపరిషత్ డిప్యూటీ సీఈవో డి.సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలో భాగంగా మండల పరిషత్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించి, రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఎంపీడీవో కొంకి అప్పారావు, ఏవో ఎ.ఎ.ఖాన్, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సర్కారు బడికి ఊతం

- ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు కేంద్రం చేయూత
- జిల్లాలో పీఎంశ్రీ పథకానికి 24 పాఠశాలల ఎంపిక
- ఐదేళ్ల పాటు స్కూళ్లకు నేరుగా జమకానున్న నిధులు
- మరింత మెరుగుపడనున్న వసతులు



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన యలమంచిలి మండలం ఏటికొప్పాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

జిల్లాలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలలు

పాఠశాల పేరు	ప్రాంతం
ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ (బాలికలు)	అచ్యుతాపురం
జెడ్పీహెచ్‌ఎస్	తుమ్మపాల, అనకాపల్లి మండలం
జెడ్పీహెచ్‌ఎస్	సీతయ్యపేట, బుచ్చెయ్యపేట మండలం
ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్	కోనాం,చీడికాడ
జెడ్పీహెచ్‌ఎస్	లక్ష్మీపురం, చోడవరం మండలం
ప్రభుత్వ ఉన్నత పాఠశాల	దేవరాపల్లి
జెడ్పీహెచ్‌ఎస్	చీడిగుమ్మల, గొలుగొండ మండలం
జెడ్పీహెచ్‌ఎస్	అలమండ కోడూరు, కె.కోటపాడు మండలం
జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)	కశింకోట
ప్రభుత్వ ఉన్నత పాఠశాల	కోటవురట్ల
జెడ్పీహెచ్‌ఎస్	కింతలి,మాడుగుల మండలం
జెడ్పీహెచ్‌ఎస్	గిడుతూరు, మాకవరపాలెం మండలం
జెడ్పీహెచ్‌ఎస్	గణపర్తి,మునగపాక మండలం
జెడ్పీహెచ్‌ఎస్	వేంపాడు,నక్కపల్లి మండలం
జెడ్పీహెచ్‌ఎస్	వేములపూడి, నర్సీపట్నం మండలం
జెడ్పీహెచ్‌ఎస్	డి ఎర్రవరం, నాతవరం మండలం
జెడ్పీహెచ్‌ఎస్ (బాలికలు)	పరవాడ
జెడ్పీహెచ్‌ఎస్	రాంబిల్లి
జెడ్పీహెచ్‌ఎస్	చినపాచిల, రావికమతం మండలం
జెడ్పీహెచ్‌ఎస్	రోలుగుంట
జెడ్పీహెచ్‌ఎస్	దార్లపూడి, ఎస్.రాయవరం మండలం
జెడ్పీహెచ్‌ఎస్	ఏటికొప్పాక, యలమంచిలి మండలం
ప్రభుత్వ ఉన్నత పాఠశాల	సబ్బవరం
ప్రభుత్వ ఉన్నత పాఠశాల	పాయకరావుపేట

అనకాపల్లి రూరల్: నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ చేపడుతుండగా నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం కూడా సర్కారు బడుల రూపు రేఖలు మార్చేందుకు చర్యలు చేపట్టింది. ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పేరిట పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యారంగంలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడమే ముఖ్య ఉద్దేశం.ఈ పథకం కింద కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు మంజూరు చేస్తే మిగిలిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుంది. పీఎంశ్రీ పథకం అమలుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పథకంలో జిల్లాలో 24 పాఠశాలలకు అవకాశం దక్కింది.

యూడైస్ ప్లస్ డేటా ఆధారంగా...

పీఎంశ్రీ కోసం యూడైస్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్‌మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ 2021–22 వివరాలు ప్రామాణికంగా తీసుకుని పాఠశాలల ఎంపిక చేశారు. పథకం ఎంపికకు నిర్దేశించిన 46 అంశాలకు అనుగుణంగా ఉన్న 100కు పైగా పాఠశాలలను గుర్తించి వాటి వివరాలను గత ఏడాది నవంబరులో విద్యాశాఖ అధికారులు కేంద్రానికి పంపించారు.పీఎంశ్రీ కింద తొలి దశలో దేశవ్యాప్తంగా 14,500 పాఠశాలలను కేంద్రం ఎంపిక చేసింది.ఇందులో మన రాష్ట్రంలో 662 పాఠశాలలు మంజూరు కాగా, అనకాపల్లి జిల్లాలో 24 పాఠశాలలు ఆ జాబితాలో చోటు సాధించాయి.గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు 60 శాతం మార్కులు, పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలు 70 శాతం మార్కులు సాధిస్తే వాటిని పీఎంశ్రీ పథకం లబ్ధికి ఎంపిక చేస్తారు. కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్యా మంత్రిత్వ శాఖ అధికారులు పంపిన జాబితాలో చోటు సంపాదించిన పాఠశాలల హెచ్‌ఎంలు, తల్లిదండ్రుల కమిటీల చైర్మన్లు,విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆధునిక వసతులతో..

ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు కేంద్ర ప్రభుత్వం మూడు విడతల్లో నిధులను కేటాయించనుంది.ఏడాదికి రూ.40 లక్షల చొప్పున రూ. 2 కోట్ల వరకు నిధులను ఐదేళ్లపాటు ఇస్తారు. ఈ నిధులతో ఎంపికైన పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేయనున్నారు.వరుసగా ఐదేళ్లపాటు నిధులను కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.సొంత భవనాల నిర్మాణం, స్వచ్ఛ మరుగుదొడ్లు, డిజిటల్ గ్రంథాలయాలు, స్మార్ట్ క్లాస్ రూం, ఆర్ట్ రూం, సోలార్ విద్యుత్ పరికరాలు, ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు, పాఠశాల ఆవరణలోనే సేంద్రియ విధానంలో కూరగాయల తోటల పెంపకం, పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, హరిత పాఠశాలగా తీర్చి దిద్దడం, శుద్ధ జలాలు అందించడం,ఐసీటీ ల్యాబ్ ఏర్పాటు, విద్యార్థులు క్రీడల్లో రాణించేలా ప్రోత్సాహం అందించడం, నాణ్యమైన విద్యకోసం ఇంటర్నెట్ సదుపాయం, ఆరోగ్యం కోసం ప్రత్యేక శ్రద్ధ, వృత్తి విద్యా కోర్సులను పాఠశాల విద్య నుంచి ప్రవేశపెట్టడమే కాకుండా నైపుణ్యాభివృద్ధి శిక్షణను అందించనున్నారు.

సమకూరనున్న ఆధునిక వసతులు



పీఎంశ్రీకి జిల్లాలో 24 పాఠశాలలు ఎంపికయ్యాయి. ఎంపికైన పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి.ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దుతోంది. పీఎంశ్రీ పథకం కింద ఆధునిక వసతులు సమకూరుతాయి. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందుతుంది. విద్యార్థులకు అన్నిరకాల నైపుణ్యాలు అందించాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం ఈ పథకం తీసుకువచ్చింది.

–ఎం.వెంకట లక్ష్మమ్మ, డీఈవో,అనకాపల్లి

వివాదంలో కోదండరాముని ఆలయం

గుడిపై పెత్తనం కోసం ఇరువర్గాల పోరు



విచారణ చేస్తున్న ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు

రావికమతం: స్థానిక కోదండరామస్వామి ఆలయం చుట్టూ కొన్నేళ్లుగా వివాదంనెలకొంది. ఆలయంపై పెత్తనం కోసం ఇరువర్గాల మధ్య పోరు జరుగుతోంది. దీనిపై ఎండోమెంటు అధికారులు తరచూ వస్తూ విచారణ చేస్తున్నారు తప్ప ఎటూ తేల్చడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శనివారం దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, ఈవో మురళీకృష్ణ ఇరువర్గాల వారితో విచారణ చేశారు. ఎంతో చరిత్ర ఉన్న ఆలయానికి 1908లో గర్నికం గ్రామానికి చెందిన బొల్లా ప్రగడ కృష్ణవేణమ్మ రావికమతంలో సర్వే నంబరు 80/7 లో 70 సెంట్లు భూమిని దానంగా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ భూమిని, ఆలయాన్ని గెంజివారి కుటుంబీకులు చూస్తూ వచ్చారు. ధూపదీప నైవేద్యాలు జరుగుతున్నా ఆలయం మాత్రం పూర్తిగా శిథిలావస్థలో ఉండడంతో గ్రామానికి చెందిన గొర్లె నాగేశ్వరరావు సంకల్పించిఆలయాన్ని అందరిసహకారంతో పూర్తిగా తొలగించి ఆ స్థానంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించారు. ఈ క్రమంలో ఎన్నెన్నో గ్రామాల నుంచి భక్తులు భారీ విరాళాలను, వస్తువులను సమర్పించారు. ఏటా స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఘనంగా జరిగేవి. ఈ దశలో పదేళ్ల క్రితం నిర్వాహకుడికి, పాత కమిటీ సభ్యులకు భేదాభిప్రాయాలు చోటుచేసుకున్నాయి. ఆలయ భూములు, షాపింగ్ కాంప్లెక్స్‌ల నుంచి భారీగా ఆదాయం వస్తున్నా అదంతా కమిటీ ఆధ్వర్యంలో ఉండగా కల్యాణోత్సవ ఖర్చులు, అర్చకుల జీతభత్యాలతో తనకు చేతి చమురు వదులుతోందంటూ నిర్వాహకుడు వాదించుకోవడంతో వివాదం తలెత్తింది. ఆలయ పెత్తనం తమదంటే తమదంటూ భీష్మించుకున్నారు. ఆ ఆలయం గెంజివారి కుటుంబీకులదని నాగేశ్వరరావును వెళ్ల గొట్టేశారు. దీంతో ఆయన ఆలయ ఆదాయం కొంత మంది స్వార్థపరులు స్వాహా చేస్తున్నారని, ఆలయాన్ని దేవదాయ శాఖలో విలీనం చేయాలని, తన వద్ద స్వామివారి విలువైన ఆభరణాలున్నాయని వాటిని సైతం స్వాధీనం చేసుకోవాలని కోర్టుకు వెళ్లారు. అయితే ఆల య నిర్వహణ తమ చేతిలోనే ఉండాలని గెంజి లోవలు, రాయుడు అధికారుల వద్ద చెబుతున్నారు. 2008లోనే దేవదాయ శాఖ పబ్లికేషన్ చేసినా అధికారులు మాత్రం ఎటూ తేల్చడం లేదు. దీనిపై ఎండోమెంటు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజును వివరణ కోరగా విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపామని, ఆలయానికి ఈవోను నియమించే వరకూ నిర్వహణతో పాటు వారి వద్ద ఉన్న ఆభరణాలను, ఆస్తులను స్వాధీనం చేసుకోడానికి సాధ్యపడదని అన్నారు.

6న మోదకొండమ్మ పండగ



మోదకొండమ్మ అమ్మవారు

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల ఆరాధ్య దేవత మోదకొండమ్మ పండగను వచ్చే నెల 6న అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని, ఈమేరకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. మోదకొండమ్మ ఆలయం వద్ద కమిటీ సభ్యులతో పండగ ఏర్పాట్లపై శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 28 నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 2 వ తేదీ నుంచి 7 వ తేదీ వరకు సురభి నాటకాలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 30 వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జూన్ 6వ తేదీన పండగ రోజు పలు ప్రదర్శనలు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, శ్రీనాధు శ్రీనివాసరావు, భీమరశెట్టి పైడియ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మేడివాడలో కలెక్టర్ సుడిగాలి పర్యటన



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

రావికమతం: మండలంలోని మేడివాడ గ్రామంలో కలెక్టర్ రవి పటాన్‌శెట్టి శనివారం సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా హైస్కూల్‌లో జరిగే నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం నాటికి పనులు పూర్తి కావాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. నేలపై కూర్చుని పిల్లలతో సరదాగా గడిపారు. పుస్తకాల్లో బొమ్మలు చూపించి, వాటి పేర్లు అడగగా చక్కగా సమాధానాలు చెప్పడంతో సంతోషించారు. పిల్లల హాజరు తక్కువగా ఉండడంపై సిబ్బందిని ప్రశ్నించారు. పిల్లల బరువు,ఎత్తులను యాప్‌లో సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. కాలనీలో విద్యుత్, తాగునీటి సదుపాయాలు సక్రమంగా లేవని పలువురు లబ్ధిదారులు కలెక్టర్‌కు తెలిపారు. దీంతో త్వరితగతిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం సచివాలయానికి వెళ్లి, అక్కడి సిబ్బంది సమయపాలన, పనితీరుపై ఆరా తీశారు. అర్జీదారులు వస్తున్నారా లేదా అని తెలుసుకున్నారు. అర్హులైనా పథకాలు వర్తించని వారి గురించి ప్రశ్నించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానంలో నెలకు రెండు సార్లు వైద్యులు వస్తున్నారా లేదా అని స్థానికులు అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో జయరాం,ఎంపీపీ పైల రాజు,తహసీల్దార్ మహేశ్వరరావు,ఎంపీడీవో వెంకన్నబాబు పాల్గొన్నారు.

బిందు సేద్యానికి 1,310 మంది రిజిస్ట్రేషన్

జిల్లా సూక్ష్మసాగునీటి పథకం పీడీ లక్ష్మి



మాట్లాడుతున్న సూక్ష్మసాగునీటి పథకం పీడీ జీవీ లక్ష్మి

నాతవరం: జిల్లాలో బిందు సేద్యానికి 1,310 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు జిల్లా సూక్ష్మ సాగునీటి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ జి.వి. లక్ష్మి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో శనివారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం డ్రిప్, స్ప్రింకర్లను రాయితీపై రైతులకు అందజేస్తోందన్నారు. డ్రిప్, స్ప్రింకర్లతో ఈఏడాది జిల్లాలో 1200 హెక్టార్లలో సాగు చేపట్టాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు ఆమె పేర్కొన్నారు. గత ఏడాది 832 హెక్టార్లలో రాయితీపై డ్రిప్, స్ప్రింకర్లను ఏర్పాటు చేశామన్నారు. డ్రిప్‌ఏర్పాటుకు ఐదు ఎకరాల లోపు భూమి ఉంటే 90 శా తం, అంతకంటే అధికంగా భూమి ఉంటే 55 శాతం రాయితీ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్ప్రింకర్లకు సంబంధించి ఐదు ఎకరాల లోపు భూమి ఉంటే 55 శాతం రాయితీ, అంతకంటే అధికంగా ఉంటే 45 శాతం రాయితీ సదుపాయం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వర రావు, హౌసింగ్ పీఆర్ జేఈలు జోగారావు, వెంకటేశ్వ రమ్మ, పంచాయతీ విస్తరణాధికారి ప్రేమలీల పాల్గొన్నారు.

ప్రతి పశువుకూ బీమా తప్పనిసరి

పశుసంవర్ధక శాఖ జేడీ ప్రసాదరావు



కొత్తకోట సదస్సులో మాట్లాడుతున్న జేడీ ప్రసాదరావు

రావికమతం/రోలుగుంట: వైఎస్సార్ పశు బీమాతో రైతు ధీమాగా ఉండవచ్చని, జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ బి.ప్రసాదరావు తెలిపారు. పశుబీమాపై రైతులకు అవగాహన కల్పించేందుకు రావికతం, రోలుగుంట మండలాల్లో కొత్తకోట,గొంప, నిండుగొండ గ్రామాల్లో శనివారం సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పశువుకూ తప్పనిసరిగా బీమా చేయించాలని చెప్పారు. పశువుకు ఒక సంవత్సరం బీమా చెల్లించినట్టయితే మూడేళ్ల పాటు వర్తిస్తుందన్నారు. సంకర జాతి పశువులకు రూ.30 వేలు, దేశీయ జాతి పశువులకు రూ.15వేలు, మేకలు,గొర్రెలకు రూ.6వేల చొప్పున బీమా వర్తిస్తుందన్నారు. ప్రీమియంగా ఎస్సీ,ఎస్టీలు సంకరజాతి పశువులకు రూ.384, దేశీయ పశువులకు రూ.480, ఇతర వర్గాల వారురూ.960 ప్రీమియం చెల్లించాలన్నారు. గొర్రెలు, మేకలకు ఎస్సీ,ఎస్టీ వర్గాల వారు మూడేళ్లకు రూ.75,ఇతర వర్గాలవారు రూ.188 చెల్లించాలని చెప్పారు. సర్పంచ్ లోవరాజు,ఉప సర్పంచ్ పి.దేవా, పశు వైద్యాధికారులు బాలశౌరి, నూకేశ్వరరావుపాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

ఎస్.రాయవరం: దార్లపూడి గ్రామంలో వివాహిత అదృశ్యం అయినట్టు తల్లి మంగి యర్రయ్యమ్మ శనివారం ఫిర్యాదు చేసినట్టు హెచ్‌సీ భూలోకరావు తెలిపారు. ఫిర్యాదు వివరాలిలా ఉన్నాయి. తన చిన కుమార్తె మణికి దార్లపూడి గ్రామానికి చెందిన లండా రాజారావుతో వివాహం చేశామని, అయితే అల్లుడు రాజారావు తరచూ మద్యం తాగి వచ్చి తమ కుమార్తెను ఇబ్బందులకు గురిచేసేవాడని, దీంతో గతంలో రెండు దఫాలు ఇంటి నుంచి వెళ్లిపోయిందని యర్రయ్యమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఇప్పుడు అదే క్రమంలో ఈ నెల 24న ఏడేళ్ల పాపతో ఇంటి నుంచి వెళ్లిపోయిందని, ఆమె ఆచూకీ తెలియ లేదని తెలిపారు. వివరాల మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

పాముకాటుతో ఒకరి మృతి



పాముకాటుకు గురై మృతిచెందిన వెంకన్న

ఎస్.రాయవరం: పెద ఉప్పలం గ్రామంలో గొర్రెల పెంపకందారుడు పాముకాటుకు గురై మృతి చెందినట్టు హెచ్‌సీ భూలోకరావు శనివారం తెలిపారు. హెచ్‌సీ అందించిన వివరాలిలా ఉన్నాయి. గుడివాడ శివారు లక్ష్మీపతిరాజుపేట గ్రామానికి చెందిన సబ్బి వెంకన్న (47) గొర్రెల మంద వద్దకు గడిచిన రాత్రి వెళుతుండగా పాముకాటుకు గురైనట్టు తెలిపారు. దీంతో వెంకన్నను నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి తుని ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఆమె మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వివాహంలో 'డ్యాన్సు' వివాదం

- ఇద్దరికి గాయాలు, ఇరు వర్గాలపై కేసుల నమోదు
- ముద్దుర్తి, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో పోలీసు పికెట్‌లు

చోడవరం రూరల్: వివాహం సందర్భంగా ఏర్పాటు చేసిన డ్యాన్సు కార్యక్రమంలో తలెత్తిన వివాదం రెండు గ్రామాల మధ్య చిచ్చురేపడంతో ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి, రెండు గ్రామాల్లో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేసి శాంతి భద్రతలు నెలకొల్పారు. మండలంలోని ముద్దుర్తి, ఎం.కొత్తపల్లి గ్రామాల్లో నెలకొన్న ఈ వివాదం చోడవరం పోలీసుల చొరవతో శనివారం సాయంత్రానికి సద్దుమణిగింది. ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి ఎం.కొత్తపల్లిలో జరిగిన వివాహ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన డ్యాన్సు ప్రోగ్రాం వద్ద అదే గ్రామానికి చెందిన నంబారు వెంకట అప్పారావుతో ముద్దుర్తి గ్రామానికి చెందిన కొంతమంది యువకులు వాగ్వాదానికి దిగారు. అతడిపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. ఎం.కొత్తపల్లి గ్రామస్తులు క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు. శనివారం ఉదయం ముద్దుర్తి గ్రామ వలంటీర్ గేదెల కుమార్ గాయపడిన వెంకటప్పారావు ఇంటి ముందు వైపు వెళ్తుండగా, అతడి తండ్రి ఈశ్వరరావు, బంధువులు మురుగుతి రాజు, నైదాన గణేష్ అడ్డుకుని కొట్టి బ్లేడుతో గాయపరిచారు. దాంతో రెండు గ్రామాల మధ్య వివాదం రేగింది. ఇది కాస్త ముదురక ముందే అనకాపల్లి డీఎస్పీ వి.సుబ్బరాజు సాయంత్రం రెండు గ్రామాల్లో సందర్శించారు. ఆయా గ్రామాల పెద్దలను చోడవరం పోలీసు స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటువంటి సందర్భాల్లో పెద్దలు జోక్యం చేసుకుని పిల్లలను వారించాలని మందలించారు. ఇరు గ్రామాల వారు సంయమనం పాటించి శాంతి భద్రతలను కాపాడాలని సూచించారు.



రెండు గ్రామాల పెద్దలతో మాట్లాడుతున్న డీఎస్పీ, సీఐ

బాధితులకు న్యాయసేవలందించాలి



డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ సుదర్శన్ రెడ్డి, నాగిరెడ్డి, దుష్యంత్ రెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

విశాఖ–లీగల్ : బాధితులకు న్యాయం చేసే విధంగా పబ్లిక్ ప్రాసిక్యూటలందరూ సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జె. సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం ఎంవీపీ కాలనీలోని ఐఎంఎం ప్రత్యేక సమావేశం మందిరంలో ఉమ్మడి విశాఖ జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పబ్లిక్ ప్రాసెక్యూలర్ ప్రత్యేక సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఉమ్మడి జిల్లాల్లో పెండింగ్‌లో ఉన్న వివిధ క్రిమినల్ కేసుల స్థితిగతులను పరిశీలించాలన్నారు. హైకోర్టు పబ్లిక్ ప్రాసెక్యూటర్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ న్యాయ సేవలు కోరుతూ వచ్చిన ప్రతి వ్యక్తికి సేవలు అందించాలన్నారు. హైకోర్టు అదనపు పీపీలు ఎస్. దుష్యంత్ రెడ్డి పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యం



మత్స్యకార బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): మత్స్యకారులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవేళలా కృషి చేస్తుందని, అన్ని రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తి రాజు అన్నారు. అచ్యుతాపురం మండలం పూడిమడకకు చెందిన మత్స్యకారుడు ఎరుపల్లి మణికుమార్ ఇటీవల సముద్ర వేటకు వెళ్లి మృతి చెందాడు. దాంతో అతడి కుటుంబానికి మత్స్యకార బీమా కింద రూ.5 లక్షల చెక్కును శనివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ భర్త కోన బుజ్జి, పూడిమడక సర్పంచ్ చేపల సుహాసిని, వడిశెల శ్రీనివాసరావు, విమలనాయుడు, పంచదార్ల పైడిరాజు, లాలం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి ఆపాలని ప్రియురాలు ఫిర్యాదు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని గవరపాలెంలో శనివారం జరిగిన వివాహ వేడుకలో హడావిడి నెలకొంది. తనను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని ఒక ఎస్ఆర్ఐ యువకుడు మోసం చేశాడని యువతి పోలీస్ ఉన్నతాధికారులకు డయల్ 100 నంబరుకు ఫిర్యాదు చేసింది. హైదరాబాద్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న ఆమె అక్కడ నుంచి శనివారం అర్ధరాత్రి బయలుదేరింది. ఇంతలో ఆ యువతి అక్కను వెంటబెట్టుకుని అనకాపల్లి పట్టణ ఎస్సై దివాకర్ గవరపాలెంలోని వివాహ వేడుక వద్దకు వెళ్లారు. అక్కడ సదరు యువతితో పెళ్లికొడుకు కలసి తీసుకున్న ఫొటోలను చూపించి పెళ్లిని ఆపడానికి ప్రయత్నించారు. అయితే పెళ్లికొడుకు బంధువులు ఫిర్యాదు చేసిన యువతి ఉండాలని చెప్పి యథావిధిగా పెళ్లి జరిపారు. ఈ విషయమై పోలీసులను అడగగా.. యువతి వస్తే గాని కేసు నమోదు చేయలేమని అన్నట్లు సమాచారం.

అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ఈ-శ్రమ్

సీతంపేట: అసంఘటిత కార్మికుల సంక్షేమానికి, సామాజిక భద్రతకు చర్యలు చేపట్టాలని సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని, ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ–శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎం.సునీత తెలిపారు. అసంఘటిత కార్మికులు తమ వివరాలను ఈశ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 5,82,946 మంది కార్మికులు ఉండగా, కేవలం 1.50 లక్షల మంది మాత్రమే తమ వివరాలను పోర్టల్‌లో నమోదు చేసుకున్నారన్నారు. కార్మికుల నమోదు కోసం కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత విభాగాల అధికారులతో సమన్వయ కమిటీ ఏర్పాటు చేశారన్నారు. అంగన్‌వాడీ సెక్టార్‌లో 10వేల మంది, మిడ్‌డే మీల్స్ విభాగంలో 10వేల మంది, ఆశావర్కర్లు 5వేల మంది, మత్స్యకారులు 50వేల మంది, డ్వామాలో 79వేల మంది, సెల్ఫ్ హెల్ప్ గ్రూపులలో 10వేల మంది, జీవీఎంసీ పరిధిలో చిరువ్యాపారులు, వలంటీర్లు, ఎస్‌హెచ్‌జీ, రిసోర్స్ పర్సన్లు, వారి కుటుంబాలు 4,89,000 మంది ఉన్నట్టు గుర్తించామన్నారు. వీరంతా తమ వివరాలు నమోదు చేసుకునేలా కమిటీ కృషి చేస్తుందన్నారు. ఈశ్రమ్ కార్డు పొందితే రెండు లక్షల ఉచిత ప్రమాద బీమా, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాల లబ్ధిని నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాకు జమ చెయ్యడం జరుగుతుందన్నారు. నమోదు కోసం అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో ప్రత్యేక నమోదు కేంద్రం (సీఎస్సీ) ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈశ్రమ్ నమోదు కోసం ఆధార్ కార్డు , దాంతో అనుసంధానమైన ఫోన్ నంబరు, బ్యాంకు అకౌంట్ పాసు పుస్తకం, నామినీ ఆధార్ కార్డుతో కార్మిక శాఖ కార్యాలయాన్ని గాని, సమీప గ్రామ, వార్డు సచివాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖ విద్య: కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ ఎగ్జామినేషన్–2023కు అర్హత గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తెలిపారు. వివిధ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు/విభాగాలు/ట్రిబ్యునల్‌లు/భారత ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ రాజ్యాంగ సంస్థలు/చట్టబద్ధమైన సంస్థలు/లోయర్ డివిజనల్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు గ్రూప్ 'సి' పోస్టుల భర్తీ కోసం స్టాఫ్ సెలక్షన్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఈనెల 9వ తేదీన వచ్చిన నోటిఫికేషన్‌లో పూర్తి వివరాలు ఉన్నాయన్నారు.

దరఖాస్తులను rrc.nic.in వెబ్‌సైట్ ద్వారా సమర్పించాలన్నారు. జూన్ 8 వరకు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఆగస్టులో జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 10, తెలంగాణాలో 3 కేంద్రాల్లో పరీక్ష ఉంటుందన్నారు.

క్లుప్తంగా

ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచిత కంటి వైద్య శిబిరంలో మహిళను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది సంధ్య

కశింకోట: గవరపేట రామాలయం వద్ద శనివారం వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 30 మందికి అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రి నుంచి వచ్చిన ఆప్తాల్మిక్ సంధ్య కంటి రోగులను పరీక్షించి 15 మందికి కంటి అద్దాలు అవసరమని గుర్తించారు. వారికి ప్రభుత్వం నుంచి త్వరలో ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు ఆమె తెలిపారు. ఇద్దరికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామని, వారు ముందుకు వస్తే ఆపరేషన్లు జరిపించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

'జగనన్నకు చెబుదాం' రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్డీవో, జోనల్ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటలకు 'జగనన్నకు చెబుదాం'కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ, జెడ్సీ పి.వెంకటరమణ శనివారం ఒక ప్రకటలో తెలిపారు. కార్యాలయం ఆవరణలో అర్జీదారులు కూర్చునేందుకు ప్రత్యేక టెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం

స్థానిక జీవీఎంసీ కార్యాలయంలో ప్రతి సోమవారం 'జగనన్నకు చెబుదాం'(స్పందన) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్సీ పి.వెంకటరమణ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు.

గడప గడపకు నేడు

అనకాపల్లిటౌన్: పట్టణంలో టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌వీధి, మెహర్‌బాబా వీధుల్లో ఆదివారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారని తెలిపారు. పలు శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని ఆయన కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 409 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,300	4,640
రెండో రకం	4,000	4,400
మూడో రకం	3,600	3,940

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	- రాజా
రామభాణం	-సత్యనారాయణ-1
అన్నీమంచి శకునములే	-సత్యనారాయణ స్క్రీన్-2
2018	-షిర్డిసాయి
ఉగ్రం	-పర్తిసాయి
ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్10	-వెంకటేశ్వర
మళ్లీపెళ్లి	-శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. 'ఎ'పాజిటివ్-5 యూనిట్లు, 'బి'పాజిటివ్-8 యూనిట్లు, 'ఒ'పాజిటివ్-35 యూనిట్లు, 'ఎబి'పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 211 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (9441108144)ని సంప్రదించవచ్చు.

పంపిణీకి రెడీ



అనకాపల్లి ఎంఈవో కార్యాలయానికి చేరుకున్న పాఠ్య పుస్తకాలు (ఫైల్‌ఫొటో)

- జూన్ 10 నాటికి పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు చేరేలా ఏర్పాట్లు
- ఎంఈవో కార్యాలయంలో చకచకా పూర్తయిన పనులు

నియోజకవర్గంలో మండలాల వారీగా పాఠశాలలు..

మండలం	ప్రాథమిక పాఠశాలలు	హైస్కూళ్లు	విద్యార్థులు
అనకాపల్లి	45	16	2650
కశింకోట	36	10,	1869
ఆదర్శ-1		కస్తూర్బ గురుకుల-2	

తుమ్మపాల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏటా అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లు పాఠశాలలు తెరవడానికి ముందుగానే మండల వనరుల కేంద్రాలకు చేరాయి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ పేద విద్యార్థి పాఠశాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని రకాల విద్యా సామాగ్రిని విద్యార్థులకు అందిస్తోంది. గత ప్రభుత్వాలు కేవలం పాఠ్య పుస్తకాలు మాత్రమే ఇచ్చేవి కానీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు స్కూల్ బ్యాగ్, షూస్, సాక్స్, నోట్‌బుక్స్, బెల్ట్ వంటి వాటిని జగనన్న విద్యాకానుక కిట్ల పేరుతో ఉచితంగా అందిస్తున్నారు. 2023-24 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరిపడా విద్యాకానుక కిట్లు అధికారులు ఇప్పటికే సిద్ధంగా ఉంచారు.

జూన్ 10 నాటికి పాఠశాలలకు చేరేలా ఏర్పాట్లు..

జూన్ 10 నాటికి పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుక కిట్లను ఆయా పాఠశాలలకు తరలించడానికి విద్యాశాఖ అధికారులు ప్రణాళిక రూపొందించారు. ఏయే పాఠశాలలకు ఎన్నెన్ని పంపించాలో లెక్కలు సిద్ధం చేశారు.

అనకాపల్లి నియోజకవర్గంలో ఒకటి నుంచి పదో తరగతి వరకూ చదివే 4519 మంది విద్యార్థులు ఉన్నారు. వారందరికీ జగనన్న విద్యా కానుక కిట్లు అందించనున్నారు.



పంపిణీకి సిద్ధంగా ఉన్న జగన్నన విద్యా కానుక కిట్లు

జగనన్న కిట్లు

ప్రతి జగనన్న విద్యాకానుక కిట్‌లోనూ ఒక స్కూల్ బ్యాగ్, ఒక బెల్ట్, షూ, రెండు జతల సాక్స్, మూడు జతల యూనిఫాం, మూడు సెట్ల నోట్ పుస్తకాలు (ఒక సెట్‌లో ఆరు పుస్తకాలు) ఉంటాయి. ఒక సెట్ పాఠ్యాంశ పుస్తకాలు ఉంటాయి. దీంతో విద్యార్థి విద్యా సంవత్సరం పొడవునా నోట్ పుస్తకాలు గాని, పాఠ్య పుస్తకాలు కాని కొనే భారం ఉండదు.

పుస్తకాల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం..



వచ్చే విద్యా సంవత్సరంలో మండలంలోని విద్యార్థులు అందరికీ సరిపడా జగనన్న విద్యా కానుక కిట్లు ఇప్పటికే వచ్చాయి. ఈ ఏడాది ముందుగానే ప్రభుత్వం వాటిని సిద్ధం చేసింది. జూన్ 12న పాఠశాలలు తెరుస్తారు. జూన్ 10 నాటికే అంటే రెండు రోజుల ముందుగానే అన్ని పాఠశాలలకు విదా కానుక కిట్లు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

డి.దివాకర్, ఎంఈవో, అనకాపల్లి మండలం.

గవరపేటలో ఫ్యామిలీ డాక్టర్



రోగులను పరీక్షిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి యశోద

కశింకోట: గవరపేటలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 80 సేవలు పొందారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యశోద శిబిరానికి హాజరైన రోగులను పరీక్షించి మందులు అందజేశారు. అవసరమైన వారికి రక్త, బీపీ పరీక్షలు చేశారు. గర్భిణులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనత, కాళ్ల నొప్పులు, మెడ, తల నొప్పులు, ఇతర సమస్యలతో రోగులు వస్తున్నారని, పరీక్షించి వారికి మందులు అందజేస్తున్నామన్నారు. ఇళ్లకు పరిమితమైన రోగులను వారి వద్దకు వెళ్లి పరీక్షిస్తున్నామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు మందులు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఆరోగ్య సిబ్బంది, 104 వాహనం సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎవరెన్ని పొత్తులతో వచ్చినా..

జగనన్నే మళ్లీ సీఎం



సంక్షేమ పథకాల పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్, కార్పొరేటర్ సునీత



బాధితునికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- ఓట్లు దండుకోవడానికి దొంగలొస్తున్నారు జాగ్రత్త
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: సమస్యల పరిష్కారానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దోహదపడుతుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత అధ్యక్షతన వార్డు పరిధిలో రజకకాలనీ, దుర్గాలాడ్జివీధి, రామచంద్ర థియేటర్ రహదారి ప్రాంతాల్లో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. నేరుగా ఆయా వీధి ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రెండుకళ్లుగా అభివర్ణించారు. ఏడాదిన్నర పాటు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని చెప్పారు. అధికారం చేపట్టిన తర్వాత ప్రజల సమస్యలు తెలుసుకోవడమే కాకుండా ఇంకా వారికి ఏం కావాలో తెలుసుకుంటూ వస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా మనమందరం జగన్ మోహన్‌రెడ్డి అండగా నిలవాలని కోరారు. నాలుగేళ్ల పాటు ప్రజల ముందుకు రాని చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ ఓట్లు దండుకోవడానికి మరలా వస్తున్నారని, అటువంటి వారికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎవరెన్ని పిచ్చిపేలాపనలు పేలినా తనకు తన నియోజకవర్గ ప్రజల ఆశీస్సులు అండగా ఉంటాయన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ భూకబ్జాదారుడు అనే ముద్ర పడడంతోనే నియోజకవర్గ ప్రజలు తనకు పట్టం కట్టారని మంత్రి అమర్‌నాథ్ చెప్పారు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వీధిలో రూ.26 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డు, డ్రైనేజీల శిలఫలకాన్ని ప్రారంభించి నియోకవర్గంలో 12 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ కింద రూ.24 లక్షల 71 వేల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎన్టీఆర్ వైద్యాలయం డైరెక్టర్ జి.రామ్మూర్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఏవీ రత్నకుమారి, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి, పట్టణ కార్యదర్శి కుండల రామకృష్ణ, పార్టీ నేతలు మునూరి శ్రీనివాసరావు, గైపూరి రాజు, పలకా సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



తాము గీసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

రాంబిల్లి : దిమిలి శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనంపై లైబ్రేరియన్ శకుంతల అవగాహన కల్పించారు. అనంతరం చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. రీసోర్స్ పర్సన్ జి.నూకినాయుడు నీతికథలు చెప్పారు. కథల్లో నీతిని విద్యార్థులు గ్రహించి సమాజంలో మంచి వ్యక్తులుగా ఎదగాలన్నారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలకు చర్యలు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక : జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని డీఎల్‌డీవో మంజులావాణి అన్నారు. హౌసింగ్ డేలో భాగంగా నాగులాపల్లి జగనన్న కాలనీని ఆమె శనివారం సందర్శించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పట్టాతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే సాయం అందజేస్తున్నామని, లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఈవో ఆర్డీ ఈశ్వరరావు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ వినయ్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



వేతనదారులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న ఏపీవో వసంత్, హెల్త్ అసిస్టెంట్

కె.కోటపాడు: వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న కారణంగా ఉపాధి పని ప్రాంతాల్లో కనీస వసతులు కల్పించడం తప్పనిసరని ఏపీవో వసంత్ తెలిపారు. ఎ.కోడూరు ఉపాధి పని ప్రాంతంలో వేతనదారులకు శనివారం ఆయన లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్‌తో కలిసి ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉదయాన్నే 11 గంటల వరకు ఉపాధి పనులను చేయడం వల్ల వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. రోజువారీ గరిష్ట వేతనం రూ.272 పొందేలా పనులను చేయాలని వేతనదారులకు సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కె.కోటపాడు: వేసవి విజ్ఞాన శిబిరంతో విద్యార్థుల్లో జ్ఞాపకశక్తి మెరుగు పడుతుందని గ్రంథపాలకురాలు ఎం.పద్మావతి తెలిపారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వచ్చే నెల 11వ తేదీన విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు



దేవరాపల్లిలో వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్ శ్రీనివాసరావు

దేవరాపల్లి: విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు దోహదపడతాయని గ్రంథపాలకుడు ఓ. శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శనివారం విద్యార్థులకు వక్తృత్వ, బుక్ రీడింగ్, కథల పోటీలను నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులను నిర్వహించారు. మాతృభాష తెలుగుతోపాటు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలన్నారు. రోజూ తెలుగు, ఇంగ్లిష్ పత్రికలు చదవాలని సూచించారు.

కెనరా బ్యాంకు బ్రాంచి ఏర్పాటుకు వినతి

మాడుగుల రూరల్: మండలంలో వీరనారాయణంలో కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విశాఖలో కెనరా బ్యాంకు ప్రాంతీయ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. పలు సంక్షేమ పథకాలకు సంబంధించి నగదు ప్రజలు ఖాతాల్లో వేస్తున్నారని, వీరనారాయణం గ్రామాన్ని మాడుగుల గ్రామీణ వికాస్ బ్యాంకు దత్తత తీసుకుందని, పూర్తిస్థాయిలో సేవలు అందించలేదని, ఈ దృష్ట్యా కెనరా బ్యాంకు బ్రాంచిని ఏర్పాటు చేయాలని కోరారు. జి.అగ్రహారం, చింతలూరు, గడబూరు, జంపెన, గాదిరాయి, సత్యవరం, ఎం. కృష్ణాపురం గ్రామాలకు ప్రయోజనం కలుగుతుందని కాళ్ల బాలకృష్ణ, తదితరులు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- నాగయ్యపేటలో మండల ప్రత్యేకాధికారి రవీంద్ర పరిశీలన



నాగయ్యపేటలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి రవీంద్ర తదితరులు

దేవరాపల్లి: నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో మంజూరు చేసిన పక్కా ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి వి.రవీంద్ర లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా నాగయ్యపేటలో పక్కా ఇళ్ల నిర్మాణాలను ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మితో కలిసి ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్ణీత గడువులోగా ఇళ్లు నిర్మాణాలను పూర్తి చేయాలని, అందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఇళ్లు నిర్మించిన వెనువెంటనే బిల్లులు మంజూరు చేస్తున్నామన్నారు. ఇంకా ముందుకు రాని వారు తక్షణమే పనులు ప్రారంభించాలని సూచించారు. హౌసింగ్ ఇన్‌చార్జి ఏఈ భవ్య తేజ, ఏపీవో డి. చంద్రకళ, ఏపీఎం ఎస్. ప్రభాకర్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వైద్యులు

అనకాపల్లి రూరల్: క్షయ రోగులు పౌష్టికాహారం తీసుకోవాలని తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు ఎం. రమేష్ నాయుడు, జి. పావని సూచించారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా శనివారం తగరంపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15 మంది క్షయ రోగులకు నెలకు సరిపడా సరకులతో కూడిన పౌష్టికాహార కిట్లు అందజేశారు. టీబీ రోగులకు రోగ నిరోధకశక్తి పెరగడానికి పౌష్టికాహార కిట్లు అందజేస్తున్నట్లు వారు చెప్పారు. క్షయ రోగులంతా క్రమం తప్పకుండా ఔషధాలు, పోషకాహారం తీసుకోవడం ముఖ్యమని వైద్యులు తెలిపారు. 2025 నాటికి టీబీని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఇందుకు క్షయ రోగులంతా వైద్య ఆరోగ్యశాఖకు సహకరించాలని కోరారు. టీబీ నిర్మూలనకు డీటీపీబీ (డిటెక్ట్, ట్రీట్, ప్రివెంట్, బిల్డ్) పద్ధతిని అవలంబిస్తున్నట్టు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ వెంకటేశ్వర్లు, ఎంపీహెచ్ఎస్ సాంబశివరావు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న యోగా సభ్యులు

అనకాపల్లిటౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే నిత్యం యోగా చేయాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు, వైద్యుడు గండి వెంకట సత్యనారాయణ అన్నారు. స్థానిక భారత స్వాభిమాన్ ట్రస్ట్, పతంజలి యోగ సమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ క్రీడా మైదానం నుంచి నెహ్రూ చౌక్ వరకూ జార్జి క్లబ్ యోగ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 28న జార్జి క్లబ్ ఆవరణలో ఉదయం 6 గంటలకు యోగాసనాల పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలిపొందిన వారికి సాయంత్రం 6 గంటలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారత స్వాభిమాన్ ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరమనాయుడు, యోగ సభ్యులు రామకృష్ణ, పెంటకోట సుబ్రహ్మణ్యం, కోలపర్తి కన్నబాబు, శ్రీనివాసరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూకు ఘన నివాళులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

అనకాపల్లిటౌన్: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చెరశాలలను ముద్దాడిన మహా యోధుడు జవహర్‌లాల్ నెహ్రూ అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడు ఐఆర్ గంగాధర్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో శనివారం భారత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 59వ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన నెహ్రూ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. నెహ్రూ కలలు గన్న దేశాన్ని నేడు మతోన్మాదులు విచ్ఛిన్నం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు దాసరి సంతోష్, బుద్ద కిశోర్, టి. సంతోష్‌గౌడ్, పిల్లి నానీగౌడ్, మందా రాజు మాదిగ, పొన్నా సుధాకర్, ఉల్లింగల సంతోష్, పిల్లి త్రినాథ్ పాల్గొన్నారు.

గ్రామాలను పరిశీలించిన ప్రత్యేక అధికారి



గొబ్బూరు అంగన్‌వాడీ కేంద్రం రికార్డులు పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రోజారాణి

కశింకోట: మండలంలోని గొబ్బూరు, జెట్టపురెడ్డితుని గ్రామాలను శనివారం మండల ప్రత్యేక అధికారి రోజారాణి సందర్శించారు. ఈ సందర్భంగా గొబ్బూరులో వైఎస్సార్ జగన్ గృహ నిర్మాణ కాలనీలను పరిశీలించారు. మిగిలిన గృహాలను వేగంగా పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. అలాగే అక్కడి సంపద కేంద్రాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం జెట్టపురెడ్డితుని హైస్కూల్లో నాడు-నేడు కింద రెండో విడతగా నిర్వహిస్తున్న పనులను పరిశీలించి, సకాలంలో పూర్తి చేయాలని కోరారు. ఏఎన్ఎం కేంద్రాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొంకి అప్పారావు, హౌసింగ్ ఏఈ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురంలో నగదు, నగలు చోరీ



దొంగలు చిందరవందర చేసిన బీరువా

కశింకోట : మండలంలోని సుందరయ్యపేట శివారు ఆనందపురంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో జరిగిన దొంగతనంలో సుమారు లక్షన్నర రూపాయల విలువైన బంగారం, వెండి సామాన్లు, నగదు అపహరణకు గురైనట్టు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి శనివారం రాత్రి విలేకరులకు తెలిపారు. ఆయన అందించిన వివరాల ప్రకారం.. ఆనందపురం గ్రామంలో నివసిస్తున్న చుండూరు వెంకట రామకృష్ణశాస్త్రి ఈ నెల 22న ఢిల్లీలోని తన పెద్ద కుమారుడి ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా గుర్తు తెలియని వ్యక్తులు అతని ఇంటి ప్రధాన ద్వారం తలుపును బద్దలు కొట్టి లోపలికి ప్రవేశించి దానిలోని రెండు బీరువాల్లో ఉన్న సుమారు ఒకటిన్నర తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి సామాన్లు, కొంత నగదు తస్కరించుకుపోయారు. రామకృష్ణశాస్త్రి బంధువైన జీవీఎస్ ప్రసాదరావు ఈ విషయాన్ని గమనించి బాధితులకు సమాచారం అందించారు. దీంతో విశాఖలో ఉంటున్న శాస్త్రి చిన్న కుమారుడు వెంకట సీతారామమూర్తి వచ్చి శనివారం ఇంటిని పరిశీలించగా దొంగతనం జరిగినట్లు, నగలు, నగదు అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఈమేరకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సక్రమంగా పౌష్టికాహారం అందించాలి



గిడుతూరులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

మాకవరపాలెం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని ఎంపీడీవో అరుణశ్రీ ఆదేశించారు. గిడుతూరులో మూడు అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌ను తనిఖీ చేసి, రోగులకు అందుబాటులో ఉండాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం జగనన్న కాలనీని సందర్శించి లబ్ధిదారులతో మాట్లాడారు. నిర్మాణాలు వేగవంతం చేయాలని, అంతే త్వరగా బిల్లులు చెల్లింపు ఉంటుందన్నారు. సచివాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ప్రజలకు నిరంతరం సక్రమంగా సేవలు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ జేఈ రామలింగస్వామి, కార్యదర్శి రాజారావు పాల్గొన్నారు.